# పేరయ్య బావి

దిగంతాల నుండి విపరీతమైన వేగంతో సుళ్ళు తిరుగుతూ సమస్త జీవరాసులలోని తేమనూ, చైతన్యాన్నీ హరించివేస్తూ వీస్తున్న వెచ్చని గాలి ఆ పరిసరాలలోకి వచ్చినంతనే చల్లబడుతూన్నట్లుగా ఉంది. ఆకాశాన ఒక్క మేఘశకలమైనా లేదు. ఎండ వేడిమికి భయపడి కీటాది క్షుద్ర జీవులు కూడా తమతమ నెలవులు విడిచి చరించడంలేదు. ఇంతసేపటికొక కాకి గూటిని వదలి ఆహారంకోసం బయటకు వచ్చిందో ఏమో, నీరసంగా ఎగురుతూ పోతున్నది.

ఆ యువకుడు సేదదీరి వేపచెట్టు బోదెకానుకొని కూర్చుని కళ్ళుమూసుకున్నాడు. అతనికి అంతా కలవలె తోచింది. అతడు ఉదయం అనగా బయలుదేరి సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చేదాకా చేతిలో సంచితో నడుస్తూనే ఉన్నాడు. అవన్నీ మరుభూములు. అక్కడక్కడ చెరువుల మీద ఆధారపడివుండే మాగాణి భూములు ఉన్నాయి. భూమి అంతా బీటలువారి నీటికి మొహంవాచి ఉన్నది. ఆ యువకుడు మరి నాలుగుమైళ్లు నడిస్తే స్వగ్రామం చేరుకోగలడనగా అతనికి విపరీతమైన దాహం ప్రారంభమైంది. వెచ్చనిగాలి బాణ వేగంతో వీస్తూవుండటంవల్ల అతని సర్వ నాడులూ క్రుంగిపోయాయి. అడుగుతీసి అడుగు వెయ్యటమే కష్టమైపోయింది. ఎక్కడా కనుచూపు మేరలో ఏవూరూ కనిపించటంలేదు. తూర్పుదిశగా ఒక వందగజాల దూరంలో ఒక వేపచెట్టు మాత్రం ఒంటరిగావుంది. అతడు ఆ చెట్టుదరికి చేరుకొన్నాడు. అతని కల వేయి రెట్లుగా ఫలించినట్టయింది. ఆ చెట్టుకు పదిగజాల దూరంలోనే ఒక బావీ, ఇనుప గొలుసుతోవున్న ఒక బొక్కెనా అతనికి కనిపించాయి. అతడు సంచి అక్కడ పడేసి త్వరత్వరగా ఆ నీళ్ళుతోడుకొని, కాళ్లూ చేతులూ మొహమూ కడుక్కుని తర్వాత కడుపునిండా త్రాగాడు. ఆ నీళ్ళు కొబ్బరిపాలవలె ఉన్నాయి. అతడు నెమ్మదిగా వేపచెట్టు బోదెకానుకొని కూర్చున్నాడు.

నిజానికి ఇంతకు పూర్వంవలె సూర్యబింబం నిప్పులను కురిపిస్తూనేవుంది. వేడిగాలి 'రివ్వున' వీస్తూనే వున్నది. అయినా అతని కళ్ళకు సమస్త ప్రపంచమూ, చల్లగా హాయిగా కనిపిస్తున్నది.

ఈ మరుభూమిలో, ఈ కాలిబాటల ప్రక్కగా ఒంటరిగా ఈ బావి ఎందుకు వుంది? అక్కడికి చుట్టూ ఏడెనిమిది మైళ్ళ పరిధిలో ఏ వూరూ ఉన్నట్టులేదు. ఈ ప్రాంతంలో బావిని ఎవరు త్రవ్వించారు? ఏ ప్రయోజనం ఉద్దేశించి త్రవ్వించారు?

ఆ యువకుడికి కొద్ది క్షణాల్లోనే మగతగా నిద్ర పట్టింది.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఏపుగా పెరిగిన వెదురుచెట్ల మధ్య భుజం మీద మంచినీళ్ళ కావడితో వడివడిగా నడుస్తున్నాడు పేరయ్య. ప్రక్కనే ఏ చెట్టు కొమ్మలలోనో దాక్కుని ఉండి కోయిల కూస్తున్నది. వేగంగా వీచే గాలిని తమలో పూరించుకొని వెదురుపొదలు 'జుమ్మ'ని శబ్దం చేస్తున్నాయి. పేరయ్య త్వరత్వరగా నడిచి వూరి చివరగా ఉన్న ఒక యింట్లో ప్రవేశించి నీళ్ళకావడి దింపాడు.

ఆ వూరిలో ఉన్న బావులన్నిటోనూ నీళ్ళు సముద్రపు నీటివలె ఉప్పగా ఉంటాయి. ఊరికి అరమైలు దూరంలో ఉన్నదొక పెద్ద మంచి నీళ్ళ బావి. ఆ బావినీరే ఊళ్ళోవారికి శరణ్యం. ఉప్పునీరు స్నానాలకూ, పై వాడకానికీ తప్ప మరెందుకూ పనికిరాదు. పేరయ్య రోజూ చీకటి ఉండగానే లేచి స్నానంచేసి, తడి గుడ్డతోనే భుజంమీద కావడి వేసుకొని బయలుదేరి, బాగా పొద్దెక్కేదాకా బావి నుంచి వూరికీ, వూరి నుంచి బావికీ తిరిగి అందరి ఇళ్ళకూ నీరు చేరవేస్తాడు. తర్వాత ఇంటికివచ్చి నాలుగు గింజలు ఉడకేసుకుని తిని కాస్సేపు నడుంవాల్చి లేస్తాడు. మూడు గంటలు కాగానే భుజంమీద కావడితో బయలుదేరుతాడు.

అతని తండ్రికూడా సరిగ్గా అలాగే చేసేవాడు. పేరయ్య పదహారేళ్ళవాడై వుండగా అతని తండ్రికి పక్షవాతం వచ్చి కాలూ చెయ్యీ పడిపోయి మంచంలోనుంచి లేవలేకపోయాడు. తర్వాత కొద్ది రోజులలోనే, పసివాడైన పేరయ్య భుజం మీద కావడి, కుటుంబ భారమూ పడ్డాయి. కుటుంబమంటే మందీ మార్బలమూ ఏమీ లేదు. అతనికి అప్పటికి ఉన్నదల్లా తల్లి ఒక్కతే. ఆమె అసలే బలహీనురాలు. పైగా భర్త మరణం ఆమెను మరింత క్రుంగదీసింది. ఆమెలో జవసత్త్వాలు సన్నగిల్లిపోయాయి. ఆమె కళ్ళు గాజుబిళ్ళలవలె ఉండేవి. పగలే చూపు సరిగా ఉండేది కాదు. అయినా తప్పనిసరి కాబట్టి నెమ్మదిగా తడువుకుంటూ ఇంటి పనులు చేసుకునేది. రోజూ పేరయ్య అన్ని యిళ్ళకూ నీళ్ళుమోసి అలసిపోయి యింటికివచ్చి భోజనం ముందు కూర్చునే సరికి ఆమె ప్రారంభించేది "ఏమిరా, నాయనా! చూస్తున్నావుగా నా అవస్థ! పెద్దముండనైనాను బ్రతికినన్నాళ్ళు బ్రతకబోను. మొన్న ఆ పుండరీకాక్షయ్య ఎక్కడో ఏదో మనువు ఉన్నదని చెప్పాడు. నువ్వు ఒక యింటివాడివైతే చూసి కళ్ళుమూస్తాను... ఏమీ సమాధానం చెప్పకుండా అలా నల్లరాయిలా కూర్చుంటావు, ఎలారా నీతో వేగటం?" అంటూవుండేది. పేరయ్య స్వతహాగా మితభాషి, తల్లి కళ్ళ నీళ్ళు పెట్టుకోవటం చూసి అప్పుడప్పుడు "ఇప్పుడేం తొందరొచ్చిపడిందే? నీకు మరీ చాదస్తం..." అనేవాడు.

అంతగా పోరు పెట్టినప్పటికీ ఆ ముసలిదాని కోరిక తీరనేలేదు. ఒకనాడు మేఘాలు ముసురుకొని పగలే చీకటి కమ్మినట్టయి, మరి కాస్సేపట్లో వర్షం ప్రపంచాన్ని ముంచెత్తుతుందనగా ఆమె వంట పూర్తిచేసి పంచలోకి వచ్చి కొంగు పరచుకుని పడుకుని సునాయాసంగా ఎవరినీ బాధ పెట్టకుండా ఒంటరిగా ప్రాణాలు వదిలింది.

పేరయ్య వచ్చి కావడి దింపి నిద్రిస్తున్న తల్లిని 'లేపి యిబ్బంది పెట్టటం ఎందుకలెమ్మ'ని అనుకుని లోపలికి వెళ్ళి సిద్ధంగావున్న అన్నం వడ్డించుకుని సుష్టుగా భోజనం చేశాడు. తర్వాత చెయ్యి తుడుచుకుంటూ పంచలోకి వచ్చి యింకా అలాగే పడుకునివున్న తల్లిని చూసి నవ్వుకుని 'అమ్మా' అని పిలిచాడు. ఆమె లేచి "ఎప్పుడు వచ్చావురా నాయనా" అని అడిగితే "నేను రావటమూ అయింది, నా భోజనమూ అయింది. నువ్వులేచి కాస్త ఎంగిలిపడు. అసలేపొద్దెక్కింది" అందామనుకున్నాడు. కాని అతడు రెండుసార్లు పిలిచినా, ఆమె కదలనైనాలేదు. అతనికి అనుమానం వేసి దగ్గరికివెళ్ళి పరీక్షగా చూసి ఒక్కసారిగా బావురుమన్నాడు. అతని ఏడుపు విని నలుగురూ చేరారు. తర్వాత వారు తలా ఒక చెయ్యి వేసి అన్ని పనులూ పూర్తిచేశారు. పేరయ్య మళ్ళీ ఆ యింట్లోకి వెళ్ళి ఒక ప్రక్కగా కూర్చుని ఒంటరిగా దుఃఖించాడు.

అప్పటికి అతనికి ఇరవైయేళ్ళు. రోజూ తెలతెలవారుతుండగా లేచి స్నానంచేసి కావడి భుజంమీద వేసుకుని బావికి బయలుదేరేవాడు. అపరాహ్ణందాకా అదేపని. తర్వాత మళ్ళీ మధ్యాహ్నం మూడు గంటలకే బయలుదేరి పొద్దుగూకిన తర్వాత యింటికి చేరుకునేవాడు.

ఆ వూరి కరణం ఒకనాడు పేరయ్యను పిలిచి "ఏమిరా! ఇలా ఎన్నాళ్ళని చెయ్యి కాల్చుకుంటావు? రేపు నేను పాలెం పోతున్నాను. నా వెంటరా, నా ఎరికలో ఒక సంబంధం వుంది. పిల్లను చూసి రావచ్చు" అన్నాడు. ఆయన ఎదుట మాట్లాడలేక పేరయ్య వినయంగా తలవూపి వచ్చేశాడేగాని తర్వాత ఆలోచిస్తే ఒక ముఖ్యవిషయం జ్ఞప్తికి వచ్చింది. పెళ్ళి అనగానే ఎంత లేదన్నా ఏమీ నగలూ నాణ్యాలూ పెట్టకపోయినా కొన్ని వందల రూపాయలు ఖర్చు. తన దగ్గర చిల్లి గవ్వకూడా లేదు. ఉన్న కొద్ది సొమ్ము తల్లి అంత్యక్రియలకూ, సంతర్పణకూ ఖర్చు అయింది. అతడు మర్నాడు కరణంగారి యింటికివెళ్ళి ఈ విషయం ప్రస్తావించాడు. డబ్బు విషయం ఎత్తగానే ఆయన నవ్వి "పిచ్చివాడా అదా నీ సందేహం? మేమంతా ఏమైపోయామనుకున్నావు? అలాంటి పిచ్చి సందేహాలు పెట్టుకోకు. ఇంటికివెళ్ళి తెల్లని చొక్కావుంటే తొడుక్కునిరా" అన్నాడు.

పేరయ్య ఇంటికివెళ్ళి తన తండ్రి తాలూకు చొక్కా ఒకటి ఏరి తొడుకున్నాడు. అది తెల్లగానే వుంది. భుజంమీద కొద్దిగా చిరిగినంత మాత్రంలో ఏమీ లోపంరాదు. పైన ఉత్తరీయం ఉండనే వుంది.

అతడు కరణంగారి వెంట పాలెంవెళ్ళి పిల్లను చూశాడు. పిల్ల తండ్రి బీదవాడు. ఆయనకు నలుగురు ఆడపిల్లలు. పెద్ద పిల్లలు ముగ్గురికి ఉన్నంతలో మంచి సంబంధాలు కుదిర్చి పెళ్ళిళ్ళు చేశాడాయన. చివరి పిల్ల పేరు వర్ధని. ఆ పిల్లవంతు వచ్చేసరికి ఆస్తి ఏమీ మిగలలేదు. పైగా పిల్ల పెళ్ళికెదిగి కూర్చున్నది. ఈ భారం ఎలావదుల్చుకోవటమా అని ఎదురుచూస్తున్న ఆయనకు పేరయ్య అన్నివిధాలా తగినవాడుగా కనిపించాడు. కుర్రవాడు కష్టపడి జీవించే తరహావ్యక్తి కాబట్టి తిండికీ బట్టకూ లోపం జరగదు.

పేరయ్య తన ముందు చాపమీద తలవంచుకుని కూర్చుని వున్న పిల్లను చూశాడు. ఆ కొద్దిసేపూ వినియోగించుకునేందుకు ప్రక్క యింటి వారినడిగి ఏవేవో నగలు తెచ్చి ఆ పిల్లను అలంకరించారు. నిజానికి ఆ పిల్లకు ఆ అలంకరణలేవీ అవసరంలేదు. మంచులో తడిసిన మందార పువ్వువంటి ముగ్ధ సౌందర్యం ఆమెది. ఆ కన్నులు విశాలములై ఆ శరీరచ్ఛాయ పదారువన్నె పసిడిఛాయతో పోటీ పడుతున్నది. ఆ తతంగం ముగియగానే పేరయ్య పెదవి కదపకుండా లేచి కరణంగారి వెంట బయటకి వచ్చాడు.

ఆయన "ఏమిరా! పేరయ్యా! పిల్ల ఎలావుంది? నచ్చిందా?" అని అడిగితే తలవూపి వూరుకున్నాడు. తర్వాత కొద్దిరోజుల వ్యవధిలోనే ఒక ముహూర్తం నిర్ణయించి నలుగురు పెద్దలూచేరి శుభకార్యం అయిందనిపించారు. పేరయ్య తన ఒంటరితనం పోయినట్టూ, తనకీ ప్రపంచంలో అతిదగ్గర బంధువు లెంతోమంది ఉన్నట్టూ అనుభూతి పొందాడు. అతని కాశ్చర్యంవేసింది. ఇన్నాళ్ళుగా ఈ విశాల విశ్వంలో 'నా' అనుకోదగిన వారెవరూలేని

తనకు ఈనాడు చిత్రంగా తననే సర్వస్వం అనుకునే ప్రాణి లభించింది. అతడు ఆనందంతో, గర్వంతో ఉప్పొంగిపోయినాడు.

తర్వాత కొన్ని నెలలకు ఆ పిల్ల చీర సారెతో కాపురానికి వచ్చింది. వస్తూ ఆ యింటికి వెలుగును తీసుకువచ్చింది? పేరయ్య జీవితాన్ని వెలిగించే జ్యోతిగా ఆమె ఆ యింట్లో అడుగు పెట్టింది. కొద్ది సాహచర్యంతోనే మామిడిచెట్టును అల్లుకున్న మాధవీ లతవలె ఆమె అతనికి తన్ను తాను అంకితం చేసుకొన్నది. రోజంతా కష్టపడి యింటికివచ్చిన పేరయ్య భార్య పరిచర్యలో స్వర్గసౌఖ్యం అనుభవించేవాడు. ఆమె, ప్రణయజలధిలో మునకలు వేసి అలసి సొలసి, కాయలు గాచిన అతని భుజాలమీద తలవాల్చి నిద్రించేది.

తర్వాత సంవత్సరానికి ఆ పిల్ల గర్భవతి అయింది. తల్లిదండ్రులు వచ్చి కాన్పుకు ఆ పిల్లను తమవెంట తీసుకుపోయారు. ఆమె వెడుతూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. పేరయ్య కూడా చలించిపోయాడు. అయినా ఆమెను సముదాయించి "పిచ్చిదానా! ఇక్కడికి పదిమైళ్ళే కదూ! ఏమన్నా దూరమా భారమా? రెండు రోజుల కొకసారి వచ్చి నిన్ను చూడకపోతే నేనుమాత్రం బ్రతకగలనా?" అన్నాడు.

అలాగే మాట తప్పకుండా అతడు రెండు మూడు రోజుల కొకసారి వెళ్ళి చూచివస్తూనే ఉన్నాడు. ఆ రోజుల్లోనే ఆమెకేదైనా ఒక బంగారునగ చేయించాలనే కోరికతో అతడు డబ్బు కూడబెట్టడం ప్రారంభించాడు.

ఆమెకు తొమ్మిది నెలలూ నిండిన తర్వాత అతడొకనాడు వెళ్ళేసరికి ఆమె కళ్ళనీళ్ళు పెట్టుకుని కూర్చునివుంది. పేరయ్య ఆమె దగ్గరకువెళ్ళి "ఏమిటే వర్ధనీ! ఎందుకేడుస్తున్నావు?" అని అడిగాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. తర్వాత పేరయ్య బావమరది నోట అసలు విషయం విన్నాడు. పండుగకు ఆమె అక్కలిద్దరూ పుట్టింటికి వచ్చారు. వారిలో ఒకామెకూ వర్ధనికీ చిన్నప్పటినుంచీ పడదు. ఆమె 'నీ మొగుడు నీళ్లుమోసుకుని బతుకుతాడ'ని వర్ధనిని ఎగతాళి చేసింది. ఆ పూట వర్ధని అన్నం తినలేదు. అక్కవచ్చి "పొరపాటున అన్నాను. బుద్ధితక్కువదాన్ని, లేచి అన్నం తినవే" అని బతిమిలాడినా ఆమె కదలలేదు...

పేరయ్యకు నవ్వు వచ్చింది. వర్ధని దగ్గరగా వెళ్ళి "ఆ మాత్రం దానికే అంత కోపం చేసుకోవాలా? తప్పుకదూ! తమాషాకు ఏదో అన్నదే అనుకో, యింత రాద్ధాంతం చెయ్యవచ్చునా? లే. త్వరగా అన్నం తిను..." అన్నాడు. ఆమె లేచి కళ్ళుతుడుచుకుని వంట యింట్లోకి వెళ్ళింది.

తర్వాత కొద్ది రోజులలోనే పేరయ్యకు పిడుగువంటి వార్త వచ్చింది. ఒక రోజున తెల్లవారుజామునే స్నానంచేసి బావికి బయలుదేరుతూ ఉండగా ఒక మనిషి వచ్చాడు. ఆ రాత్రి అతని భార్యకు నొప్పులు వచ్చాయనీ, కాన్పు కష్టమయిందనీ, పిల్లపుట్టి పోయిందనీ, తల్లికూడా బ్రతికేదాకా నమ్మకంలేదనీ కబురు తెచ్చాడా వ్యక్తి. పేరయ్య కాళ్ళ క్రింద భూమి కరిగిపోతున్నట్లనిపించింది. త్వరత్వరగా పంచె కట్టుకుని పైన ఉత్తరీయంతో ఆ మనిషి వెంట నడిచాడు. అంత దూరమూ తన పెన్నిధిని తనకు దూరం చెయ్యవద్దని భగవంతుణ్ణి ప్రార్థిస్తూనే నడిచాడు. కాని విధి ప్రతికూలంగా వ్యవహరించింది. అతనికి చూపులైనా అందలేదు.

పేరయ్యకు లోకమంతా చీకటి అనిపించింది. అతని సుఖం చట్టుబండలై పోయింది. దొరికినట్లే దొరికి అంతలోనే చేయిజారిపోయిందొక అమృత కలశం. అతడు ఎంతోసేపు శిలావిగ్రహంవలె చేష్టలుడిగి కూర్చుండిపోయాడు.

పేరయ్య మళ్ళీ తనపని ప్రారంభించాడు. జీవితం మళ్ళీ గాడిలో పడింది. ఒంటరిగా నిర్లిప్తంగా రోజు గడపటం ప్రారంభించాడు. అతని మనసులో దిగులులేదు. బాధలేదు. యంత్రంవలె తయారైనాడు.

అప్పుడప్పుడూ వారు వీరు 'మళ్ళీ పెళ్ళిచేసుకో పేరయ్యా!' అనేవారు. అతడు వారి మాటలువిని నవ్వి వూరుకునేవాడు. తర్వాత ఏళ్ళు గడిచేకొద్దీ అతనిలో మార్పు వచ్చింది. అకాల వార్థక్యం అతని సర్వాంగాలనూ ఆక్రమించింది. మొహం ముడతలుపడి జుట్టు తెల్లబడింది. శరీరంలో జవమూ, సత్త్వమూ ఉడిగిపోయి ఉత్సాహం తగ్గింది. అతడు తనపని తప్ప మరే విషయాన్ని పట్టించుకునేవాడు కాదు.

ఒకనాడు కరణం అతన్ని పిలిచి 'పేరయ్యా! మా అమ్మాయికి ఏటి అవతల భోగాపురంలో సంబంధం కుదిరింది. నువ్వు వెళ్ళి లగ్న పత్రిక యిచ్చిరావాలి" అన్నాడు. పేరయ్య తలవూపి, అప్పటికి అన్ని యిళ్ళలోనూ నీళ్ళు చేరవెయ్యటం పూర్తి అయినందువల్ల, యింటికి వెళ్ళి త్వరత్వరగా నాలుగు గింజలు ఉడకేసుకుని తిని చొక్కా తొడుక్కుని సిద్ధమై వచ్చాడు. కరణం అతని చేతికి పసుపు పూసిన లగ్నపత్రిక యిచ్చాడు. పేరయ్య ఉత్సాహంతో నడవటం ప్రారంభించాడు.

నడివేసవి, వేడిగాలి విసురుగా వీస్తున్నది. ఆ గాలికి సర్వావయవాలూ చచ్చుబడిపోతున్నాయి. పేరయ్య కాలిబాట వెంట ఏడుమైళ్ళు నడిచిపోయి భోగాపురం చేరుకొని అక్కడ యిల్లువాకబుచేసి కనుక్కొని లగ్నపత్రిక యిచ్చి మళ్ళీ వెంటనే బయలుదేరాడు. "ఈ ఎండలో ఎలా పోగలవు? కాస్త నడుంవాల్చి పోరాదూ?" అని ఆ యింటి యజమాని చెప్పినా వినక "కాదండీ బాబుగారూ! అక్కడ నీళ్ళ యిబ్బంది ఉన్న సంగతి మీకు తెలుసుగా! కాస్త పొద్దువాటారేసరికి నేను కావడి భుజాన వేసుకోవాలి. లేకపోతే అందరూ యిబ్బంది పడతారు" అని సమాధానం చెప్పి తాంబూలంలో వచ్చిన రెండు రూపాయలూ రొండిన దోపుకొని తిరుగుముఖం పట్టాడు.

ఎండ వేడిమి ఏమాత్రమూ తగ్గలేదు. భానుబింబం నిప్పులు చెరుగుతున్నది. వేడిగాలి యథాప్రకారం బాణ వేగంతో వీస్తూనే వున్నది. పేరయ్య కాళ్ళకు చెప్పులైనాలేవు. ఆ ఏటి యిసుకలో నడిచి అవతలి ఒడ్డు చేరుకునేసరికి అతనికి ఆయాసం వచ్చింది. కాళ్లు బొబ్బలెక్కినయ్. విపరీతమైన దాహంతో నాలుక పిడచగట్టుకపోతున్నది. ఉత్తరీయం కళ్ళకు ఒత్తుకుంటూ అతడు ఒక్క క్షణం వెనక్కి తిరిగి నుంచున్నాడు. విపరీతమైన వేగంతో సుడిగాలిరేగి అతన్ని ఎర్రని దుమ్ములో ముంచివేసింది. అతని శరీరం తూలిపోయింది.

కొద్ది గజాల దూరంలో అతని కళ్ళకొక విశేషం కనిపించింది. అతడు తనలో "ఛ... ఇది నా భ్రమ అయివుంటుంది... ఈ మరు భూమిలో... యింత ఎండలో... అబ్బే" అనుకుంటూ తూలుతూ ఆ వైపు నడిచాడు.

ఎనభైఏళ్ళ ముదుసలి ఒకామె నాలుగైదు తాటాకులతో ఒక చిన్న పందిరి వేసుకుని కాలిబాట పక్కగా కూర్చునివుంది. ఆమె ముందు రెండు కుండల నిండుగా చల్లని నీళ్ళు

ఉన్నాయి. ఆమె, తూలుతూ వచ్చిన పేరయ్యకు ఒక చెంబునిండా నీళ్ళు అందించి, "బాగా ఎండ దెబ్బ తిన్నావు... ముందు మొహం కడుక్కో నాయనా... ఒక్క క్షణం ఆగి నీళ్లు తాగవచ్చులే... ఇప్పుడే తాగితే వడతగులుతుంది" అన్నది.

పేరయ్య కాళ్ళూ, చేతులూ, మొహమూ కడుక్కున్నాడు. ఆ నీళ్ళ స్పర్శకే అతనిలో జీవం మొసులెత్తింది. ఖాళీచెంబు ఆమె కందించి ఒక్క క్షణం కూర్చున్నాడు. తర్వాత ఆమె త్రాగేందుకు నీళ్ళు అందించింది. కడుపునిండా ఆ చల్లని నీళ్ళు తాగి ఒక మూలగా ఆ నీడలో ముడుచుకుని పడుకున్నాడు పేరయ్య. అతనికి నిద్ర ముంచుకు వచ్చింది.

అతనికి మెలకువ వచ్చేసరికి ఎండవేడిమి కొద్దిగా తగ్గింది. గాలిలో వెచ్చదనం కూడా తగ్గిపోయింది. అతడు లేచి ఆ అవ్వవంక ఒక్కసారి చూశాడు. ఆమె బోసినోటితో మెరుపు మెరిసినట్టు నవ్వింది. పేరయ్య "వస్తానమ్మా" అంటూ నడవటం ప్రారంభించాడు.

అతడు కరణంగారి యింటికి వెళ్ళి కబురుచెప్పి తన యింటికి వచ్చాడు. చొక్కావిప్పి వంకెకు తగిలించి సందుగు పెట్టెలోనుంచి ఒక చిన్న రేకుపెట్టె బయటకి తీశాడు. అందులో ఎన్నో ఏళ్ళ క్రిందట తన భార్యకు ఏదైనా నగ చేయిద్దామని అతడు కూడబెట్టిన ధనం వుంది. ఆ మొత్తం మొదట వంద రూపాయలే. ఆ తర్వాత అడపాదడపా లభించిన డబ్బు కూడా అందులోనే వేశాడు. కూర్చుని అంతా లెక్కపెడితే రెండువందల పదిహేను రూపాయలున్నాయి. ఇప్పుడు లగ్నపత్రిక మూలంగా దొరికిన రెండు రూపాయలు కూడా అందులో వేశాడు.

తర్వాత కొన్ని రోజులపాటు అతడు ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడుకాదు. తాను ఆనాడు ఎండలో పడిన అవస్థ మళ్ళీ మళ్ళీ గుర్తుచేసుకునేవాడు. ఆ ముదుసలి తన పాలిట దేవతవలె ఆనాడు అక్కడ ఉండబట్టి సరిపోయింది. లేకపోతే తానప్పటి కప్పుడే ప్రాణాలు వదిలివుండేవాడు. రైలుస్టేషను నుంచి ఏ వూరికి రావాలన్నా ఆ కాలిదోవలే గతి. ఒక వూరినుంచి మరొక వూరికి పోవాలన్నా ఆ మరుభూములలో కాలిబాటలే శరణ్యం.

కరణంగారి యింట్లో పెళ్ళి అయిపోయింది. పేరయ్యకు విపరీతమైన తాకిడి తగిలింది. అతడు కావడి క్రిందికి దింపేందుకు కూడా వీలు చిక్కలేదు. ఆ హడావుడి తగ్గిన తర్వాత కరణంగారు పేరయ్యకు ఇరవైరూపాయాలూ, ఒక ధోవతుల చాపూ తాంబూలంలో పెట్టి యిచ్చాడు.

పేరయ్య ఒకనాడు నడిచివస్తూ ఆగిపోయాడు. ఇంతకుపూర్వం కాలిబాట ప్రక్కన అవ్వ కూర్చునివున్న చోట పదేళ్ళ పిల్లవాడు కూర్చుని వున్నాడు. 'ఇక్కడ అవ్వ ఏదీ?' అని పేరయ్య అడిగిన మీదట ఆ పిల్లవాడు కళ్ళనీళ్లు పెట్టుకుని "మా నాయనమ్మ... చచ్చిపోయింది" అన్నాడు.

పేరయ్య కొద్ది క్షణాలపాటు చేష్టలుడిగి నిలుచుండిపోయాడు. తర్వాత నెమ్మదిగా నడిచి తన వూరికి వచ్చాడు.

అతడు రెండురోజులపాటు ఏ మాలోచించాడో తెలియదు. మూడోనాడు ప్రొద్దున్నే నలుగురు పనివాళ్ళను పిలిచి వారితో మంతనాలు ప్రారంభించాడు. వాళ్ళలో ఒకడు

"నీకు పిచ్చిగాని పట్టిందా బాపనయ్యా! అక్కడ బావి తవ్వటం ఎందుకు? తవ్వినా నీళ్లు పడవుకదా? అంతా గొడ్డునేల" అన్నాడు. పేరయ్య వినిపించుకోలేదు. "మీకు కావలసింది డబ్బు. నేనిస్తానుగా. మా పెరట్లో తవ్వినా వూరిబయట తవ్వినా ఒక్కటే... ఏమంటారు?" అని అడిగాడు. వాళ్లు తలలూపి 'సరే' అని వెళ్ళిపోయారు.

మర్నాడు ఉదయమే ఊరిబయట కాలిబాటల ప్రక్కగా బావి త్రవ్వకం ప్రారంభమైంది. కరణం అదివిని పేరయ్య యింటికి పరుగెత్తుకువచ్చి "నీకు పిచ్చిపట్టిందా పేరయ్యా! ఇప్పుడే విన్నాను. ఏమిటీ పని?" అని అడిగాడు. పేరయ్య ఏమీ మాట్లాడకుండా శిలావిగ్రహంవలె కూర్చున్నాడు. ఎంతసేపటికీ జవాబు చెప్పలేదు.

వరుసగా నాలుగురోజులు పని సాగింది. గంగ కటాక్షించలేదు. పేరయ్య తన పనులన్నీ పూర్తిచేసుకుని అక్కడికి వెళ్ళి కూర్చునేవాడు. నాలుగోనాడు పనిపూర్తిచేసుకుని యిళ్ళకు తిరిగిపోతూ పనివాళ్ళు పెదవులు విరిచారు.'లాభంలేదు. ఇక్కడ జలపడదు' అన్నారు. పేరయ్య కళ్లు చెమర్చినయ్. పనివాళ్ళంతా వెళ్ళిపోయిన తర్వాతకూడా అతడక్కడే చాలాసేపు కూర్చున్నాడు. చీకటి పడింది. పేరయ్య కదలలేదు. చిన్న చిన్న రాళ్లు చేతిలోకి తీసుకుని బావిలోకి విసిరివేస్తూ ఆలోచనలో పడ్డాడు. ఉన్నట్టుండి అతని శరీరం జలదరించింది. 'బుడుంగు' మని చిన్న శబ్దం వినిపించి అతడు ఆతృతగా బావిలోకి తొంగిచూశాడు. నీళ్ళు! అతడు త్వరత్వరగా పనివాళ్ళు ఏర్పరచుకొన్న మెట్లుదిగి లోపలికి వెళ్ళి దోసిలినిండా నీళ్ళు తీసుకుని కళ్ళకద్దుకున్నాడు. ఆ నీళ్ళు కొబ్బరిపాలవలె ఉన్నాయి. అతడు ఉత్సాహంతో పొంగిపోతూ, నీళ్ళు నిండిన కళ్ళతో యింటికి వచ్చాడు. ఆ రాత్రి వాకిట్లో వేపచెట్టు క్రింద కుక్కిమంచంలో పడుకుని చల్లనిగాలి అలలు అలలుగా వీచి జోకొడుతూ ఉండగా ఆదమరచి నిద్రపోయాడు.

ఆ మరుభూమిలో జలపడటం, అందులోనూ అంత తీయని నీళ్ళు పడటం అందరికీ చిత్రమనిపించింది. తర్వాత రెండు మూడు రోజులలో పనివాళ్ళు బావి చుట్టూ పళ్ళెం కూడా కట్టి డబ్బు తీసుకుని వెళ్ళిపోయారు. పేరయ్య వాళ్ళతో మాట్లాడుకొన్న డబ్బుకాక తనదగ్గర మిగిలిన మరో అయిదురూపాయలుకూడా వాళ్ళకే యిచ్చాడు. అతని మనస్సు ఎంతో తేలికపడింది.

తర్వాత అతని జీవితం చాలా సాధారణంగా గడిచిపోయింది. వూళ్ళో ఎవరి యింట్లోనైనా పెళ్ళివంటి శుభకార్యాలు ఘటిల్లినప్పుడు ఉత్సాహంగా పనిచేసేవాడు. అతనికి నీళ్ళకావడి ప్రియతమమైన వస్తువైపోయింది. అతడు రోజూ బావి నుంచి యింటికి వచ్చే దోవలో అటూ ఇటూ ఉన్న వెదురుపొదలు కాలక్రమేణా దట్టంగా పెరిగినయ్. ఆ వెదురు పొదలలోనుంచి రకరకాల ధ్వనులు వినిపిస్తూ ఉండేవి. కోయిల సమయం వచ్చినప్పుడు ఆకుల గుబురులలో దాక్కుని ఎవ్వరికీ కనిపించకుండానే కర్ణపేయంగా కూస్తూ వుండేది. వూళ్ళో హరికథ, భజనవంటి కాలక్షేపాలున్నప్పుడు పేరయ్య హాజరవుతూ ఉండేవాడు. భజన సమయంలో నలుగురితోచేరి 'సెమ్మె' చుట్టూ తిరుగుతూ చిరుతలు మోగిస్తూ పాటలు పాడుతూ ఉండేవాడు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

ఆ యువకుడు కళ్ళు విప్పి చూశాడు. ఎండలో చురుకుపాలు తగ్గింది. ఒక కాకి 'కావు కావు' మని అరుస్తూ ఎగిరిపోతున్నది. రెండు మూడు మబ్బు తునకలు ఆకాశంలో కదులుతున్నాయి. దూరం నుంచి సముద్రపు గాలి తెరలు తెరలుగా వీస్తున్నది.

అతడు లేచి నిలబడి, "అవును ఈ బావి త్రవ్వించిన వాడూ అందరిలాగే కాలం చేరువైనప్పుడు శాశ్వతంగా కన్నుమూసి ఉంటాడు. అయినా, ఇంకా అతడు దాహంగొన్న బాటసారులకు ప్రాణదానం చేస్తూనే వున్నాడు. అతని ఆత్మ యీ పరిసరాల్లోనే విహరిస్తూ దాహంగొన్న వారిని ఇటువైపే లాక్కునివస్తుంది. అటువంటి వ్యక్తులకు 'పునర్జన్మ' ఉండదు' అనుకుంటూ చేతిలో సంచితో నడక సాగించాడు.

28-6-1961, ఆంధ్రసచిత్ర వారపత్రిక ♦

♦ ♦ ♦